

రోడ్డు విస్తరణ జరిగేనా?



- గుంతలమయంగా ఆర్నకొండ-మల్యాల రహదారి
- కనీస మరమ్మతులు కరువు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు

చొప్పదండి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి నియోజకవర్గం లోని గ్రామీణ ప్రాంతాలను కలిపే ఆర్నకొండ-మల్యాల రోడ్డు అభివృద్ధికి నోచుకోవడం లేదు. మండలంలోని ఆర్నకొండ నుంచి గోపాలరావుపేట మీదుగా మల్యాల, జగిత్యాలకు వెళ్లే ఈ రహదారి అధ్వానంగా తయారైంది. పలు మండలాలను కలిపే ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఆర్నకొండ వద్ద రాయపట్నం రహదారి నుంచి ప్రారంభమై రాగంపేట, రేవెల్లి, పెద్దకుర్మపల్లి, రామడుగు మండలం గోపాలరావుపేట నుంచి గంగాధర మండలం బూరుగుపల్లి, మల్యాల వరకు ఈ రహదారి ఉంటుంది. పలు గ్రామాల ప్రజలు ప్రతి నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. వర్షాలకు రోడ్డు చాలా చోట్ల దెబ్బతిన్నది. కనీసం మరమ్మతులకు నోచుకోలేదు. మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నా పట్టిం చుకునే వారు కరువయ్యారు.

● నిధులు మంజూరైనా..

ఆర్నకొండ నుంచి మల్యాల వరకు మరమ్మతుల కోసం ఏడాది క్రిత మే నిధులు మంజూరయ్యాయి. మూడు బిట్లుగా విభజించి కాంట్రాక్టర్‌కు పనులు అప్పజెప్పారు. ఆర్నకొండ నుంచి గోపాలరావుపేట, అక్కడి నుంచి బూరుగుపల్లి వరకు, అక్కడి నుంచి మల్యాల వరకు మూడు బిట్లుగా విభజించారు. పనులు మొదలయ్యే క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయాయి. తిరిగి ఇప్పటి వరకు కనీసం మరమతులు చేపట్టలేదు. వర్షాలకు రోడ్డు దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నియోజకవర్గంలోని అధిక భాగం ఈ రోడ్డు పరిధిలోకి వస్తుండడంతో సీఆర్ఎఫ్ నిధులతో పనులు చేపట్టాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రతిపాదనలను పంపించారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో కేంద్ర నిధులుమంజూరవుతాయని ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.



ఆర్నకొండ- రాగంపేట మధ్య రోడ్డు పై గుంతలు

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి
● సోషల్ మీడియా దుష్ప్రచారాన్ని, కుట్రలను తిప్పికొట్టాలి
● అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలి
● మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
7

ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడడం విడ్డూరం
సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి
7

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

- స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలి
- ప్రతి బాలెట్ బాక్స్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలాసత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్

కరీంనగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి లోపాలు, తప్పులు జరుగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. గురువారం అంబేద్కర్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయుల, పట్టభద్రుల బ్యాలెట్ బాక్సులను వేర్వేరుగా ఏర్పాటు చేసి, విభజన స్పష్టంగా ఉండాలని అన్నారు. పోలీసు బందోబస్తు, బారికేడ్ల ఏర్పాటు, పోలింగ్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీసు అధికారులతో చర్చించారు. స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని, అన్ని వైపులా సీసీ కెమెరాలను అమర్చాలని ఆదేశించారు. 24 గంటల పాటు ఫైరింజన్ అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు పంపించే ప్రతి బ్యాలెట్ బాక్సును క్షుణ్ణంగా తనిఖీ చేసి లాక్ సిస్టమ్ సరిచూసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి



సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న టీజీఎన్‌పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) సదర్‌లాల్

హుజూరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని టీజీఎన్‌పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) సదర్‌లాల్ అన్నారు. గురువారం హుజూరాబాద్ డివిజన్‌లో నిర్మాణంలో ఉన్న సబ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజూరాబాద్ డివిజన్ పరిధిలో రాబోయే మూడు నెలల్లో గణనీయంగా విద్యుత్ డిమాండ్ పెరగనుందన్నారు. అంచనాల ప్రకారం మూడు నెలలుగా వేసవి కాల ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకొని అందుకు అనుగుణంగా సరిపడా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశామన్నారు. ముందస్తుగా లోడ్ పెరిగే ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి కొత్తగా 45 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని, 36 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామన్నారు. మిగతా వాటివి కూడా పనులు జరుగుతున్నాయని, ఫిబ్రవరి నెలలో పూర్తి చేయాలని ఆదేశించారు. హుజూరాబాద్, అమ్మనగుర్తి, కొరపల్లిలో 33/11 కేవీ సబ్ స్టేషన్ల పనులు జరుగుతున్నాయని, పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువాలన్నారు. అవసరం మేరకు కొత్త ఫీడర్లను ఏర్పాటు చేస్తామన్నారు. వేసవికి పూర్తిగా సన్నద్ధంగా ఉన్నామని, ఎటువంటి అంతరాలు లేకుండా మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ మేక రమేష్‌బాబు, డీఈ లక్ష్మారెడ్డి, డీఈ కన్‌స్ట్రక్షన్ చంద్రమౌళి పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ



గౌరవ వందనం స్వీకరిస్తున్న అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శిక్షణలో నేర్చుకున్న అంశాలతో విధుల్లో మెరుగైన సేవలను అందించాలని అడిషనల్ డీసీపీ ఎ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహిసున్తున్న ఆర్మ్‌డ్ రిజర్వ్ వార్షిక మొబిలైజేషన్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల సమస్యలు తలెత్తినప్పుడు వాటిని అదుపు చేయడానికి రిజర్వ్ పోలీసుల సేవలు వినియోగించుకుంటామన్నారు. కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రజనీకాంత్, జానీమియా, శ్రీధర్ రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి సీసీఐ కొనుగోళ్లు..

జమ్మికుంట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం నుంచి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లను ప్రారంభించనున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆర్ మల్లేశం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పత్తి విక్రయానికి తీసుకువచ్చేప్పుడు ఆధార్ కార్డు, పట్టదార్ పుస్తకం, ఆధార్‌కు అనుసంధానంగా ఉన్న బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు. ఇకపై సీసీఐ కొనుగోళ్లు సజావుగా కొనసాగుతాయని, రైతులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం



ధర్నాలో మాట్లాడుతున్న డివిజనల్ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు

భగత్‌నగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ డివిజనల్ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు విమర్శించారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు గురువారం గంట పాటు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఎల్ఐసీలో వెంటనే క్లాస్ త్రీ, క్లాస్‌ఫోర్ కేడర్లలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ పెన్షనర్స్ అసోసియేషన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతం, డివిజన్ నాయకులు వామన్‌రావు, సూర్యకళ, సత్తయ్య, బసవేశ్వర్, అనుపమ, శ్రీలత పాల్గొన్నారు.

చిన్నబోతున్న 'సన్నాలు'



- అధిక ఉష్ణోగ్రత, చలిని తట్టుకోలేకపోతున్న వరి
- అదునుకు ముందే కంకి
- యూరియా అధిక వాడకంతో విజృంభిస్తున్న తెగుళ్లు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులు పంటల సాగుపై ప్రభావం చూపిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతోపాటు రాత్రి పూట చలి వాతావరణం ఉండడంతో సన్న రకాల వరి సాగు కష్టంగా మారింది. పంట వేసిన దగ్గర నుంచి ఆశించిన స్థాయిలో ఎదుగుదల లేకపోగా, పంట ఎర్ర బారుతోందని రైతులు అంటున్నారు. అదును రాకముందే తల్లి కర్ర నుంచి కంకి బయటకు వస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పంట ఎదుగుదల లోపించడంతోపాటు మిగతా కర్రల నుంచి కంకులు వచ్చే పరిస్థితి కనిపించక దిగుబడులపై ప్రభావం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హుజూరాబాద్ మండల వ్యాప్తంగా 18,200 ఎకరాల్లో సన్నరకం వరిని సాగు చేస్తున్నారు.

● యాసంగిలో కష్టమే..

సన్నాలు వానాకాలంలో సాగుకు అనుకూలంగా ఉంటాయి. యాసంగిలో అధిక ఉష్ణోగ్రతలు, చలికి సన్నరకాలు తట్టుకోలేవు. ప్రస్తుతం పగటి పూట 36 డిగ్రీల ఉష్ణోగ్రత, రాత్రిపూట మంచు కురుస్తుండడంతో భిన్నమైన వాతావరణ పరిస్థితులు ఉన్నాయి.

సన్నాలు ఎందుకు..?

సాధారణంగా యాసంగి సాగు అంటే గుర్తుకు వచ్చేది ఎంటీయూ-1010 దొడ్డురకం వరి మాత్రమే. ఈ రకం అధిక వేడిని తట్టుకుంటుంది. తెగుళ్ల బెడద ఉండదు. పెట్టుబడి తక్కువ. సన్నరకాలకు మార్కెట్లో డిమాండ్ అధికంగా ఉండడంతో కోసిన వెంటనే పచ్చిధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఈ రకాలపై బోనస్ ఇస్తోంది. దీంతో రైతులు సన్న వరి రకాలపై ఆసక్తి చూపుతున్నారు.

నవంబరు-డిసెంబరు నెలల్లో నాట్లు వేసిన వరి పైర్లు తెగుళ్ల బారిన పడుతున్నాయి. రైతులు సేంద్రియ ఎరువులు వాడకుండా భాస్వరం ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తుండడంతో పిలకలు రాకుండానే ముందుగానే కంకులు వస్తున్నట్లు వ్యవసాయాధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

● తెగుళ్ల బెడద..

సన్నాలు నాట్లు వేసిన దగ్గర నుంచి తెగుళ్ల వెంటాడుతున్నాయి. పంట ఎర్రగా మారడంతో పాటు మొగి పురుగు వ్యాప్తి అధికంగా ఉంది. ముందుగా వేసిన వరినాట్లు వేసి రెండు నెలలు గడిచినా, అడుగు కంటే మించి పెరగలేదు. దీంతో రైతులు ఎకరానికి నాలుగు నుంచి ఐదు బస్తాల యూరియా వేస్తున్నారు. అధిక నత్రజని వినియోగంతో పంటకు అగ్గి తెగులు వ్యాపిస్తోంది. అగ్గి తెగులు నియంత్రణకు రైతులు మందులు పిచికారి చేస్తున్నారు. దీంతో పెట్టుబడి పెరుగుతోంది.

● సస్యరక్షణ చర్యలు

వరిలో అగ్గి తెగులు కనిపిస్తే గట్లను శుభ్రంగా ఉంచుకోవాలి. నత్రజని సంబంధిత ఎరువులైన యూరియా, కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని తగ్గించాలి. నీరు తక్కువగా పెట్టడం లేదా ఆర బెట్టుకోవాలి. అగ్గి తెగులు తీవ్ర స్థాయిలో ఉంటే ట్రైసైక్లోజోల్+ పికాక్సిస్ట్రోబిన్ 400 మిల్లీలీటర్లు లీటర్ నీటికి లేదా టెబుకోనజోల్ + ట్రిఫ్లాక్సిస్ట్రోబిన్ 100 గ్రాములు ఎకరానికి పిచికారి చేయాలి.

పెట్టుబడులు పెరుగుతున్నాయి..

దూంపేటి నరేష్, రైతు, బొత్తలపల్లి



వాతావరణ మార్పులతో పంటలో ఎదుగుదల లేదు. పంట ఎదుగుదల కోసం యూరియా వేసినా ఎలాంటి మార్పు కనిపించడం లేదు. తల్లి కర్ర నుంచి కంకులు వస్తున్నాయి. తెగుళ్ల సమస్య అధికమైంది. పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయి. ఆశించిన మేర దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. సాగులో ఇబ్బందులు పడుతున్నం. చేసిన కష్టం చేతికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి

చాడ భూమిరెడ్డి, ఏవో, హుజూరాబాద్



కాండం తొలుచు రెక్కల పురుగులు ఎక్కువగా నారుమడిలో ఎగురుతూ కనబడుతుంటాయి. పసుపు గోధుమ వర్ణంలో ఉన్న రెక్కల పురుగులు ఆకు కొనలపై ఉదయపు వేళలో కనబడుతాయి. ఆకులపైన, కాండముపైన కనబడతాయి. గుడ్ల నుంచి వచ్చిన పురుగులు కాండంలోనికి ప్రవేశించి గుజ్జుని తినడం వలన మొవ్వులు ఎండిపోతాయి. పూతదశలో ఈ పురుగు ఆశిస్తే కంకి మొత్తం తెల్లగా అయిపోతుంది. నారుమడిలో రెక్కల పురు గుల నివారణకు వేప నూనెను వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. నారుమడిలో కార్బొఫ్యూరాన్ 3జి గుళికలు ఒక కిలో చల్లితే 25 నుంచి 30 రోజుల వరకు పురుగులను నివారించవచ్చు.

రోడ్లు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



ఫుట్‌పాత్‌పై సామగ్రిని తీసివేయిస్తున్న పోలీసులు, నగరపాలక సంస్థ సిబ్బంది

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రోడ్లు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను పోలీసులు, మున్సిపల్ సిబ్బంది తొలగించారు. నగరంలో దర్జాగా రోడ్లు, ఫుట్‌పాత్‌ల కబ్జా... శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. గురువారం నగరంలోని మున్సిపల్ కాంప్లెక్స్, మార్కెట్ రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయం, ప్రకాశం గంజ్, టవర్‌సర్కిల్, అంబేద్కర్ స్టేడియం తదితర ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లపై వ్యాపారులు ఏర్పాటు చేసిన బోర్డులు, సామాన్లను తొలగించారు. ట్రాఫిక్ సీఐ రమేశ్, ఎస్ఐ ఇషాక్, మున్సిపల్ డీఆర్ఎఫ్ ఇన్‌చార్జి, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, విజయ్ ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే శిక్షిస్తామని హెచ్చరించారు. రోడ్లపై వాహనాలను నిలుపవద్దని, దుకాణదారులు రోడ్లు, ఫుట్‌పాత్‌లపై బోర్డులు ఏర్పాటు చేయవద్దని హెచ్చరించారు.



రోడ్లపై ఆక్రమణలు తొలగిస్తున్న పోలీసులు, నగరపాలక సంస్థ సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో సింగరేణి ఉద్యోగి దుర్మరణం

రామగిరి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పిలో అసిస్టెంట్ ఫోర్‌మన్‌గా పని చేస్తున్న ఉరకుండ రాజ్‌కుమార్(38) అనే సింగరేణి ఉద్యోగి గురువారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి వాగులో పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ ఉదయం పెద్దపల్లి-మంథని ప్రధాన రహదారిలో పెద్దపల్లి నుంచి కల్వచర్ల వైపు ఏపి15ఏజె 8307నెంబరు గల ద్విచక్రవాహనంలో వస్తున్నారు. మూల మలుపువద్ద వాహనం అదుపుతప్పి బొక్కల వాగులోకి పడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి సీఐ రాజుగౌడ్ చేరుకొని మృతదేహన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

- కారకుడంటూ ఓ వ్యక్తి ఇంటి ఎదుట మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన



బాపుసాయిపేటలో ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు

కోనరావుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోగా, అందుకు ఓ వ్యక్తి వ్యక్తి కారకుడంటూ అతడి ఇంటి ఎదుట మృతదేహంతో బంధువులు ఆందోళన దిగారు. ఇంటిని ధ్వంసం చేయడానికి యత్నించగా విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించి మృతదేహన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గ్రామస్థుల కథనం ప్రకారం కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన బత్తుల రేణ(22) అనే వివాహిత బతుకుతెరువు కోసం వేములవాడ రూరల్ గ్రామమైన నాంపల్లిలో ఉంటోంది. నాంపల్లిలో గురువారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గతంలో భర్త మల్లయ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వీరిద్దరి మృతికి కారకుడు అంటూ బావుసాయిపేట గ్రామానికి చెందిన బత్తులఅంజయ్య ఇంటిముందు రేణ మృతదేహంతో ఆందోళన దిగారు. కోపంతో ఇంటిని ధ్వంసం చేయడానికి యత్నించారు. పోలీస్ బందోబస్తు నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా, ఎలాంటి సంఘటన జరగకుండా బావుసాయిపేట గ్రామంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

కోనరావుపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గుంటి భూమయ్య(62) అనే వృద్ధుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయం చూసి దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి విచారణజరిపి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ: మహిళకు గాయాలు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుగులపల్లి గ్రామ శివారులో గోదావరిఖని వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్, కారుఢీకొనగా బస్‌లో ప్రయాణిస్తున్న మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం గోదా వరిఖని వైపు వెళ్తున్న బస్‌ను కారు ఓవర్ టేక్ చేస్తూ బస్‌ను ఢీ కొట్టింది. దీంతో అప్రమత్తమైన బస్‌డ్రైవర్ బ్రేక్‌వేయడంతో పెద్దప్రమాదం తప్పిందన్నారు. బస్‌లో ప్రయాణిస్తున్న మహిళకు స్వల్పగాయాలు కాగా స్థానిక ఆసుపత్రికి తరలించారు.

రవాణాశాఖ కార్యాలయంలో దాడిచేసిన వ్యక్తి రిమాండ్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లారవాణాశాఖ కార్యాలయంలో ఇటీవల ఓ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన కేసులో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన రౌతు నాగరాజును గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్లలో బూడిద లోడ్‌తో వెళుతున్న రెండులారీలను జిల్లా మోటారు వాహనాల తనిఖీ అధికారి వంశీధర్ తనిఖీ చేయగా అధిక లోడు ఉన్నదని కేసు పెట్టి బస్సు డిపోకి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న వాహనాల యజమాని మంగళవారం సాయంత్రం మద్యం తాగి వచ్చి రవాణాశాఖ కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసంచేసి కార్యాలయ సిబ్బంది కానిస్టేబుల్ ప్రశాంత్‌ను గాయపరిచారనే ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి అరెస్ట్ చేశామని ఆయన తెలిపారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

ముత్తారం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖమ్మంపల్లి, అడవి శ్రీరాంపూర్, లక్కారం, ఓడేడు గ్రామాల్లో గుడుంబా స్థావరాలు నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సారాతయారీకి ఉపయోగించే బెల్లం పానకం సుమారు 200లీటర్లవరకు ధ్వంసంచేశారు. తనిఖీలలో ఎక్సైజ్ఎస్ఐ సాయి కుమార్, సిబ్బందిరాజేందర్,రాజ్‌కుమార్,నిరంజన్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

మక్కల లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా

- డ్రైవర్‌కు స్వల్పగాయాలు



బోల్తా పడిన ట్రాక్టర్

సుల్తానాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండల పరిషత్ సమీపంలోని మజీద్ ఎదురుగా ఉన్న రోడ్డులో మూలమలుపు వద్ద ఓ గొయ్యి ఏర్పడి నెలలు గడుస్తుంది. ఈ రోడ్డులో వెలుతున్న అనేక వాహనాలు గొయ్యి గమనించక ప్రమాదాల బారినపడ్డాయి. గురువారం కాల్వశ్రీరాంపూర్ నుంచి సుల్తానాబాధ్‌కు మక్కల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ గొయ్యిని గమనించక మూలమలుపు వద్ద నుంచి వస్తుండగా ట్రాక్టర్ గోతిలో పడి బోల్తాపడింది. డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డాడు. ప్రాణాపాయం తప్పింది. నెలలు గడుస్తున్నా కూడా గొయ్యిని పూడ్చడమో కానీ మరమ్మతు చేయించడమో పట్టించుకోని అధికారుల పట్ల పలువురు నిరసన వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు.

కుక్క దాడిలో పది మందికి గాయాలు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం సుందరయ్యనగర్‌లో గురువారం వీధికుక్క దాడిలో పదిమందికి గాయాలయ్యాయి. బాధితులు సుందరయ్యనగర్‌లోని అర్బన్ ఆసుపత్రికి వెళ్లగా వైద్యురాలు సాహితి చికిత్స చేసి వాక్సిన్ వేశారు. వెంటనే వైద్యురాలు మున్సిపల్‌అధికారులకు సమాచారం ఇచ్చారు.

కమ్మనైనది అమ్మ భాష



- భావ ప్రకటనకు మాతృభాషే కీలకం
- తొలిపలుకులు నేర్చేది అమ్మ భాషలోనే..
- నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

జగిత్యాల/కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మానవుడు పుట్టిన తర్వాత ఏ భాషైతే మాట్లాడుతాడో అదే అతడి మాతృ భాష. ఫిబ్రవరి 21ని అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవంగా జరుపుకోవాలని 1999 నవంబరు 17న యునెస్కో తీర్మానాన్ని ఆమోదిం చింది. ఈ దిశలో శుక్రవారం ప్రపంచ మాతృ భాషా దినోత్సవం జరుపుకుంటున్నాం. కృష్ణ దేవరాయలతో దేశ భాషలందు తెలుగు లెస్స అని, విదేశీయులతో ఇటాలియన్ ఆఫ్ అది ఈస్ట్ అని అనిపించుకున్నది తెలుగు భాషా మెకంజీ, బ్రౌన్, మన్రో, హాల్డెన్ వంటి పాశ్చాత్య చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం సమన్వయశక్తి, విభిన్న ప్రవంతులను లీనం చేసుకునే సమర్థత తెలుగు భాషకే ఉంది.

● ఆరు వేల భాషలు..

ప్రపంచంలో మొత్తం ఆరు వేల భాషలుండగా భారత దేశంలో 1,652 మాతృ భాషలున్నాయన్న అంచనా ఉంది. వీటిలో 16 భాషలకు మాత్రమే లిపి ఉంది. 200 భాషలకు 1,600లకు పైగా మాండలికాలున్నాయి. మాతృభాష అంతరించి పోయే ప్రమాదాన్ని గమనించిన యునెస్కో ప్రజల జాతీయ, పౌర, రాజకీయ, సాంఘిక, ఆర్థిక సాంస్కృతిక హక్కుల్లో మాతృభాష అంతర్భాగమని నిర్వచించింది. దేశంలో 57 అక్షరాలు, 3 ఉభయ అక్షరాలు ఉన్న తెలుగు భాష ప్రపంచ భాషల్లోనే రెండో అతి పెద్ద మాతృ భాషగా మన్ననలు పొందుతోంది.

సంస్కృతికి మూలం..

మాతృ భాషను పరిరక్షించుకోవడమంటే మన సంస్కృతిని పరిరక్షించుకోవడమే. ఎన్నో సాహిత్య ప్రక్రియలు, సారళ్యం, స్పష్టత, సౌష్టవం, సౌందర్యం, సమన్వయం వంటి లక్షణాలు కలిగి భావ జాల వ్యాప్తికి పరస్పర సంభాషణానుకూలమై పల్లవిస్తోంది తెలుగు భాష. దేశంలో కొన్ని రాష్ట్రాల వారు మాతృ భాషకు పట్టం కడుతుంటే మనం మన భాషను మాట్లాడానికే ఇబ్బంది పడుతున్నాం. ఆంగ్లంపై మోజు పెంచుకున్న మనం తెలుగును సమున్నత రీతిలో గౌరవించలేకపోతున్నాం. తెలుగును అధికారిక భాషగా ఇప్పటికీ అమలు చేయలేక పోతున్నాం.

జాతీయ భాషగా తెలుగుకు అర్హత....
డాక్టర్ నలిమెల భాస్కర్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత



జాతీయ భాషగా తెలుగుకున్న గొప్ప అర్హత మరే ఇతర భాషకు లేదు. తక్కువ సమయంలో నైపుణ్యాన్ని, విస్తృత జ్ఞానాన్ని పొందవచ్చు. ఇతర భాషలను సులువుగా నేర్చుకునే సౌలభ్యం మాతృ భాష ద్వారా సాధ్యం. లిపి సౌకర్యం, అజంత భాష కావడంతో గానానుకూలంగా ఉంటుంది.

భాషను బతికించుకుందాం..
డాక్టర్ గండ్ర లక్ష్మణ్‌రావు, సాహితీవేత్త



మాతృ భాషను బతికించుకోవాలి. ఎన్నో సాహిత్య ప్రక్రియలున్న తెలుగు భాషా ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పాలి. కార్యాలయాలు, విద్యాలయాల్లో, ఇంటా బయటా తెలుగులోనే మాట్లాడుతూ అన్ని వ్యవహరాలు జరిపితేనే మాతృ భాష మనుగడ సాధిస్తుంది.

ప్రభుత్వ వ్యవహారాలన్నీ ప్రజల భాషలో నడవాలి
అన్నవరం దేవేందర్, రచయిత

మాతృ భాషలో విద్యా బోధనతో పాటు ప్రభుత్వ వ్యవహారాలన్నీ ప్రజల భాషలో నడవాలి. అన్ని స్థాయిలో తెలుగును నిర్బంధంగా అమలు చేయాలి. మాండలికాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.



తెలుగు వెలుగులు పంచాలి..
కాండూరి వేంకటేశ్వర్లు, తెలుగు పండితుడు

తెలుగు వెలుగులు పంచాలి. విద్యార్థులకు మాతృభాషకు చెందిన అష్టావధానం, అంత్యాక్షరితో పాటు సామెతలు, లోకోక్తులు, నుడికారాలు, శతక పద్యాలు, నీతి కథలు, ప్రాచీన, ఆధునిక కవులు, రచయితలను పరిచయం చేయాలి.



మాతృభాషను ప్రోత్సహించాలి
డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, జగిత్యాల

అన్ని భాషలకంటే అమ్మ భాష కమ్మనైనది. మాతృ భాషలో విద్యా బోధన విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గిస్తోంది. బిడ్డకు అమ్మ పలుకే కమ్మగా ఉంటుంది. అందుకే అమ్మ భాష తీయగా ఉంటుంది. మాతృ భాషలోని పదనిసలు, భాషా సౌందర్యం చిన్నతనం నుంచే పరిచయం అవుతుంది. మాతృ భాషకు చెందిన కథల పుస్తకాలు, నవలలు, పురాణాలు, ఇతిహాసాలు వంటి వాటిని చదవడాన్ని ప్రోత్సహించాలి.



మాతృ భాషను కాపాడుకుందాం...
అయిత అనిత, కవయిత్రి, జగిత్యాల

మాతృ భాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. మాతృ భాషపై పట్టు సాధించిన వారు మిగితా భాషలను, విజ్ఞానాన్ని తొందరగా సముపార్జించగలరు. అమ్మను ఎంత ప్రేమగా, గౌరవంగా చూసుకుంటామో మాతృ భాషను అంతే ప్రాణంగా పరిగణించాలి. విద్యార్థులకు మాతృ భాష విశిష్టతను తెలియజేసే విధంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ, మాతృ భాష వినియోగాన్ని పెంచుతూ భావి తరాలకు మాతృ భాషను కానుకగా ఇద్దాము.



గోపాల్‌రావుపేటలో దొంగతనం

రామడుగు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన గోలి మధుసూదన్‌రెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. మధుసూదన్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఇంటికి తాళంవేసి బుధవారం బంధువుల ఇంటికివెళ్లారు. తాళం పగలగొట్టి ఇంటిలో ప్రవేశించి ప్రవేశించిన దొంగలు బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న 10తులాల బంగారు ఆభరణాలతో పాటు 2.84లక్షల రూపాయలు ఎత్తుకెళ్లారు.. గురువారం ఉదయం ఇంటికి వచ్చిన మధుసూదన్‌రెడ్డి కుటుంబ సభ్యులు తలుపులు తెరిచి ఉండడంతో దొంగతనం జరిగిందని గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రామడుగు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మానకొండూర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్ది మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మానకొండూర్‌లో పట్టుకున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దుర్శేడ్ ప్రభుత్వ పాఠశాలలో క్షుద్ర పూజల కలకలం



ప్రధానోపాధ్యాయుడి గది ఎదుట ముగ్గు, నిమ్మకాయలు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో క్షుద్ర పూజల కలకలం రేపింది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ప్రధానోపాధ్యాయుని కార్యాలయం ఎదుట పసుపు, కుంకుమ, నిమ్మకాయలు ఉంచారు. గురువారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో విద్యార్థులు స్కూల్‌కు రావడంతో వాటిని చూసి భయందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని గ్రామస్థులకు, ఉపాధ్యాయులకు తెలిపారు. అయితే గ్రామంలో ఇటువంటి సంఘటనలు జరగడం సర్వసాధారణమే అని గ్రామస్థులు అంటున్నారు.. గతంలో కొందరు ఆకతాయిలు పాఠశాలలోని బెంచీలు, స్విచ్‌బోర్డులు విరగగొట్టిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. పాఠశాల విద్యార్థులే ఈచర్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

గంజాయి రాకెట్‌ను ఛేదించిన పోలీసులు

- సీసీ కెమెరాల అమ్మకాల ముసుగులో దందా
- ఈ కామర్స్ ఏజెన్సీల ద్వారా డెలివరీ
- ఛత్తీస్‌గఢ్ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న 96.7కిలోల గంజాయి పట్టివేత
- రెండు కేసుల్లో 1.2 క్వింటాళ్లు స్వాధీనం
- విలువ రూ.60లక్షలు, రెండు కేసుల్లో 15మంది అరెస్టు



నిందితుల అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో గంజాయి ఆనవాళ్లు లేకుండా చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో రామగుండం కమిషరేట్ టాస్క్‌ఫోర్స్ బృందాలు గంజాయి రవాణా, అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టాయి. పకడ్బందీ సమాచారంతో ఒకే రోజు మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో దాడులు నిర్వహించి 1.2క్వింటాళ్ల గంజాయిని పట్టుకున్నారు. 15 మంది నిందితులను అరెస్టు చేసి రెండు కార్లు, ఐదు మోటార్ సైకిళ్లు, 17సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం కమిషరేట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీశ్రీనివాస్ అరెస్టు వివరాలను వెల్లడించారు. మంచిర్యాల పట్టణంలోని ఎస్‌బీఐ కాంప్లెక్స్ సెల్లార్‌లో సోమ ప్రవీణ్ సీసీ కెమెరాల షాపు పేర గంజాయి అమ్మకాలుచేస్తున్నట్టు గుర్తించిన పోలీసులు దందాను గుట్టు రట్టు చేశారు. సోమ ప్రవీణ్, అతని స్నేహితుడు సతీష్, మరికొందరు సీలేరు నుంచి గంజాయి తీసుకువచ్చి సీసీ కెమెరాల గోడౌన్‌లో నిల్వ చేసేవారు. అనుమానం రాకుండా ప్యాక్‌చేసి ఈ కామర్స్ డెలివరీ ఏజెన్సీల ద్వారా కస్టమర్లకు పార్సిళ్ల రూపంలో చేరవేసేవారు. అనుమానం వచ్చిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు దీనిపై నిఘా పెట్టారు. గురువారం గోడౌన్‌పై టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. బాల నేరస్థుడితో పాటు 11మందిని అరెస్టు చేయగా మరో 11మంది పరారీలో ఉన్నారు. అప్పటికే సోమ ప్రవీణ్, రాజు అనే వ్యక్తులు బయటకు వెళ్లగా ఇరుగురాళ్ల సతీష్ కుమార్(34), మహ్మద్ సమీర్(19), భీమ అనుదీప్(21), మహ్మద్ అబ్దుల్ ఉబేద్(22), అర్జున్ బాబురావు చౌహాన్(26), మహ్మద్ అజీజ్(19), జాడి రాఘవేంద్రస్వామి(23), గూడూరు రాము(20), ఎస్‌కే అతహర్(18), ఎస్‌కే సమీర్(25)లను పట్టుకున్నారు. ప్రధాన సూత్రధారి సోమ ప్రవీణ్, తగరపు రాజు, అతని భార్య శృతి, తరగపు వినయ్, రామారపు రాకేష్, శ్రీధర్, మున్ని, ఆల్ మేకర్ శ్యామ్, క్వార్టర్ సాయి, సోహెల్, చింటు పరారీలో ఉన్నారు. వీరివద్ద నుంచి 23.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 11ఫోన్లు, ఐదు బైక్‌లు, ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్లు సీజ్ చేశారు.

గోదావరిఖని టుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 11ఏ క్రాస్‌వద్ద గురువారం ఛత్తీస్‌గఢ్ నుంచి గంజాయిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, టుటౌన్ పోలీసులు తనిఖీలు జరిపారు. మహారాష్ట్రకు వెళతున్న రెండు కార్లను తనిఖీ చేయగా కారు డిక్కి కింది భాగంలో ప్రత్యేక బాక్స్‌లు ఏర్పాటు చేసి రవాణా చేస్తున్న గంజాయిని పట్టుకున్నారు. 96.7 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఉదయ్ వీర్(32), ఒడిశాకు చెందిన కేశవ్ కర, సోమనాథ్ కర, రాజస్థాన్‌కు చెందిన రాజు లోధి సంజు ఒక ముఠాగా ఏర్పడి గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. ఈ నలుగురిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు సూరజ్, అర్జున్ బోరిలు పరారీలో ఉన్నట్టు సీపీ తెలిపారు. రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న 1.2 క్వింటాళ్ల గంజాయి విలువ మార్కెట్‌లో రూ.60లక్షలు ఉంటుందని సీపీ శ్రీనివాస్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. పట్టుబడిన నిందితులపై పీడీ యాక్టు నమోదు చేయడమే కాకుండా, వారి ఆస్తులను జప్తు చేస్తామని సీపీ హెచ్చరించారు. గంజాయిని పట్టుకోవడంలో కృషిచేసిన ఎస్‌టీ, టాస్క్‌ఫోర్స్, మంచిర్యాల, గోదావరిఖని టుటౌన్‌పోలీసులను సీపీ అభినందించారు.

విలేకరుల సమావేశంలో పెద్దపల్లి డీసీపీ చేతన, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, మంచిర్యాల సీఐ ప్రమోద్‌రావు, టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్, టుటౌన్ సీఐ ప్రసాద్‌రావు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు: సీపీ



ఇసుక క్వారీ వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటున్న రామగుండం సీపీ శ్రీనివాస్

ముత్తారం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని, అక్రమరవాణాను అరికట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఖమ్మంపల్లి, జిల్లాలపల్లిలోని ఇసుక క్వారీలను సీపీ తనిఖీచేశారు. క్వారీ సందర్శించిన అనంతరం ప్రధానంగా రవాణదారులు ఇసుకను అక్రమంగా తరలించే మార్గాలను తెలుసుకున్నారు. వాహనాల వేబిల్స్, లోడ్ పరిమితిని పరిశీలించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ అక్రమంగా ఇసుక తరలించే వారి సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలని, వారి కార్యకలాపాలపై దృష్టిపెట్టాలని అధికారులకు సూచించారు. తనిఖీలు జరిపే సమయంలో సిబ్బంది తప్పని సరిగా తనిఖీచేసిన వాహనవివరాలు నమోదు చేయాలని, ఇసుక తరలించే వాహనాల ధ్రువపత్రాలు ఉన్నాయే లేవో పరిశీలించాలన్నారు. ఇసుక రవాణా వాహనాలపై నిఘా పెట్టాలని, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేవిధంగా ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతితో నడుస్తున్న రీచ్‌లనుంచి ఇసుకను తరలించే విధానాన్ని సీపీ పరిశీలించారు. పెద్దపల్లి డీసీసీచేతన, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర, గోదావరిఖని ఏసీపీ రమేష్, మంథని సీఐ రాజు, ముత్తారం ఎస్ఐ నరేష్ ఉన్నారు.

రెవెన్యూ శాఖలో ఏసీబీ కలకలం..

- ఏసీబీకి చిక్కిన సర్వేయర్
- ల్యాండ్ సర్వేకు రూ. 17 వేలు డిమాండ్,
- ఏసీబీని ఆశ్రయించిన ప్రైవేట్ ఉద్యోగి
- రూ.3 వేలు లంచం తీసుకుంటూ అధికారులకు చిక్కిన వైనం

మంథని, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మంథని రెవెన్యూశాఖలో పనిచేస్తున్న అవినీతి ఉద్యోగిని ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలో గురువారం సాయంత్రంలంచం తీసుకుంటూ ల్యాండ్ సర్వేయర్ జాటోతు గణేష్ ఏసీబీకి పట్టుబడ్డాడు. మంథనికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి సువర్ణ క్రాంతినాగ్ వద్ద రూ.3 వేలు లంచం తీసుకోగా ఏసీబీ డీఎస్పీ వీవీ రమణ మూర్తి, సీఐలు కృష్ణకుమార్, తిరుపతిలు దాడిచేసి ల్యాండ్‌సర్వేయర్ గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లి విచారించారు. మంథని మున్సిపాలిటీ పరిధి గంగాపురి సమీపంలోని వ్యవసాయ భూమిని సర్వే చేయటానికి ల్యాండ్ సర్వేయర్ గణేష్ రూ. 17 వేలు డిమాండ్ చేశాడు. క్రాంతి తొలుత ఈనెల5న రూ.9వేలు సర్వేయర్‌కు ఇచ్చి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. గురువారం మరో రూ.3వేలు లంచం తీసుకుంటుండగా సర్వేయర్ గణేష్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈమేరకు సర్వేయర్ గణేష్ పై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'సిటీ కాలేజ్ మక్దూమ్ మొహియుద్దీన్ నేషనల్ అవార్డు'కు 'నలిమెల' ఎంపిక


డాక్టర్ నలిమెల భాస్కర్

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన బహుభాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత, అనువాదకుడు, రచయిత డాక్టర్ నలిమెల భాస్కర్‌కు ప్రతిష్ఠాత్మక 'సిటీకాలేజ్ మక్దూమ్ మొహియుద్దీన్ నేషనల్అవార్డు' ప్రకటించారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన ప్రభుత్వ సిటీ కాలేజ్ ప్రిన్సిపల్ ఆచార్య పి బాలభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల24న ఉదయం 10-30గంటలకు ప్రభుత్వ సిటీ కళాశాల, గ్రేట్‌హాల్‌లో పురస్కారం ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుగొండ నిత్యానందరావు, అతిథులుగా మన తెలంగాణ దినపత్రిక సంపాదకుడు దేవులపల్లి అమర్, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు డాక్టర్ యాకూబ్, రచయిత అన్నవరం దేవేందర్ పాల్గొంటారని తెలిపారు. సమావేశాన్ని కళాశాల ఆచార్యులు డాక్టర్ విష్ణువ్‌దత్ శుక్లా, డాక్టర్ ఏలూరు యాదయ్య, డాక్టర్ కోయి కోటేశ్వరరావు సమన్వయం చేయను న్నారని తెలిపారు.

మహాశివరాత్రికి ఉత్సవ కమిటీ ఏర్పాటు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- 29 మందితో 5 రోజులు కొనసాగనున్న కమిటీ

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులను విడుదల చేసింది. 29మంది సభ్యులతో ఐదు రోజుల పదవి కాలంతో పూర్తి వివరాలతో కూడిన ఉత్వర్వులను దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ విడుదల చేశారు. ఈనెల 23వ తేది నుంచి 28వ తేదివరకు ఉత్సవ కమిటీ పదివీబాధ్యతలు చేపడుతారని పేర్కొన్నారు. కమిటీ ఏర్పాటుకు కృషి చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు అనుముల చంద్రం, వడ్డేపల్లి వెంకటరమణ, కే. రాజిడ్డి, సి. విజయలక్ష్మీ, సాగరం వెంకటస్వామి, పాత సత్యలక్ష్మీ, కూరగాయాల కొమురయ్య, సంద్రగిరి శ్రీనివాస్, నాంపల్లి శ్రీనివాస్, పులి రాంబాబు, తూము సంతోష్, వకుళభరణం శ్రీనివాస్, పిల్లి కనుకయ్య, సంఘ స్వామి యాదవ్, జగన్మోహన్‌రెడ్డి, చేపూరి గంగయ, చింతపంటి రామస్వామి, కాయతి నాగరాజు,తొట్ల అంజయ్య, ఏనుగు రమేష్‌రెడ్డి, సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, ధర్న మల్లేశం, ఒలిమినేని నిత్యానందరావు, గొట్టె ప్రభాకర్, బుస్సా దశరథం, తాటికొండ పవన్, ముప్పిడి శ్రీధర్, సుగూరి లక్ష్మీ, తోట లహరిలతో కమిటీని ఏర్పాటు చేశారు.

'మహాశివరాత్రి'కి రావాలని దేవాదాయశాఖ మంత్రికి ఆహ్వానం


దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు రావాల్సిందిగా రాజన్నఆలయ ఈవో వినోద్‌రెడ్డి దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖను ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం కలిసి మహాశివరాత్రి ఆహ్వాన పత్రికను అందజేయగా, ఆలయఅర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. కాగా రెవెన్యూ ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, సీఎం సలహాదారు శ్రీనివాసరాజు, లాసెక్రెటరీ తిరుపతిరెడ్డిలకు మహాశివరాత్రి జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు.

రాజన్న భక్తులకు అందుబాటులో హెల్ప్‌లైన్ నంబర్లు..

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి జాతరకువచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. నిత్యం ఆలయంలో చేపట్టే జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పలువురు అధికారుల హెల్ప్‌లైన్ నంబర్లను భక్తులకు అందుబాటులో ఉంచారు. వేములవాడ రెవెన్యూ డివిజనల్ అధికారి 7032675222, వేములవాడ ఏఎస్పీ 8712656412, రాజన్న ఆలయ ఈవో 9491000743, తహసీల్దార్ 7337234446, టౌన్‌సీఐ 8712656413, వెద్యాధికారి9440078901, మున్సిపల్‌కమిషనర్ 8008578959, స్టేషన్ ఫైర్‌ఆఫీసర్ 8712699261, ప్రోటోకాల్‌ఆఫీస్ 08723-236040 నంబర్లను సంప్రదించాల్సిందిగా ఆలయ ఈవో కోరారు.

రంగు మారిన 'రాజన్న' ధర్మగుండం నీరు

- దుర్వాసన వస్తోందని వాపోతున్న భక్తులు
- ఎప్పటికప్పుడు శుద్ధి చేయాలని డిమాండ్


రంగుమారిన ధర్మగుండంలోని నీరు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి క్షేత్రంలో ఈనెల 25 నుంచి 27 వరకు మహాశివరాత్రి జాతర నిర్వహించనున్నారు. వారం రోజుల ముందు నుంచే రాజన్న ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. నిత్యం వేల సంఖ్యలో భక్తులు రాజన్న ఆలయానికి వస్తున్నారు. వచ్చిన భక్తులు ముందుగా ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని రాజన్నకు మొక్కులు చెల్లించుకుంటారు. అయితే ధర్మగుండంలోని నీరు రంగుమారి దుర్వాసన వెదజల్లుతోందని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు నీటిని శుద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.


ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పని చేయని స్నానాల నల్లాలు..

ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించిన భక్తులు పక్కనే స్నానాలు చేసేందుకు ఆలయాధికారుల నల్లాలను ఏర్పాటు చేశారు. అయితే కొంతకాలంగా నల్లాలు పని చేయకపోవడంతో భక్తులు ధర్మగుండంలోనే స్నానాలు చేస్తున్నారు. శివరాత్రి జాతర సందర్భంగా భక్తుల తాకిడి పెరగడంతో నల్లాలను కూడా బాగు చేయించి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

ధర్మగుండంలో నీటిని ఎప్పటికప్పుడు శుద్ధి చేయాలి
మేర్గు లక్ష్మణ్, నాంపల్లి



మహాశివరాత్రి జాతర సందర్భంగా నిత్యం 30వేల నుంచి 50 వేల వరకు భక్తులు రాజన్న దర్శనానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ధర్మగుండంలోని నీరు రంగు మారి దుర్వాసన వస్తోంది. ఎప్పటికప్పుడు నీటిని శుద్ధి చేసి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి. ధర్మగుండం పక్కన ఉన్న నల్లాలను సైతం ప్రారంభిస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.

నీటి నాణ్యతను నిత్యం పరిశీలిస్తున్నాం..
వినోద్‌రెడ్డి, రాజన్న ఆలయ ఈవో



మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వేల సంఖ్యలో భక్తులు వస్తున్న క్రమంలో సంబంధిత మెడికల్, హెల్త్ అధికారులతో నిత్యం నీటి నాణ్యతను టెస్ట్ చేయిస్తున్నాం. సంబంధిత అధికారులు సూచనలు చేసిన వెంటనే నీటిని శుద్ధి చేస్తున్నాం. ఎప్పటికప్పుడు నీటిని శుద్ధి చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్న తపాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పావని, వ్యాయామఉపాధ్యాయుడు సాన బాబు పేర్కొన్నారు. ఇటీవల గాలిపెల్లిలో జరిగిన జిల్లాస్థాయి సబ్‌జూనియర్స్ పోటీలలో బాలుర విభాగంలో సుదగోని అఖిల్, బుర్ర హర్షవర్దన్, బాలికల విభాగంలో కెశవేని అన్విత, ఎంగ్ర సంజనలు ఉత్తమ ప్రదర్శన కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల21నుంచి వికారాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈసందర్భంగా పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. వీరిలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ బట్టు పద్మశ్రీనివాస్, ఈతరం యువజన సంఘ అధ్య క్షుడు గోవికారి నరేష్, కార్యదర్శి ఎంగ్ర చింటులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

బెంగుళూరుకు బస్సు చార్జీలో రాయితీ

భగత్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బెంగుళూరుకు వెళ్లే బస్సు చార్జీలో పది శాతం రాయితీ ఇస్తున్నట్లు కరీంనగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, గోదావరి ఖని డిపోల నుంచి బెంగుళూరుకు వెళ్లే బస్సు సర్వీసులలో బెంగుళూరు వరకు ప్రయాణించే ప్రయాణికులకు పదిశాతం రాయితీ కల్పిస్తు న్నట్లు తెలిపారు. ఈ బస్సుల్లో బెంగుళూరు వరకు ప్రయాణించే ప్రయాణికులు పదిశాతం రాయితీసౌకర్యం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడడం విడ్డూరం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని బద్ధం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టులపై కేసీఆర్ మాట్లాడడం తగదన్నారు. మునుగోడు ఎన్నికల్లో కమ్యూనిస్టులు లేకుంటే బీఆర్ఎస్ అభ్యర్థి గెలిచేవాడా ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. మేడిగడ్డపై జ్యూడిషియల్ విచారణ జరుగుతున్న నేపథ్యంలో రాజలింగు హత్యకు గురికావడంపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్రవిచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా జాతీయ ఎన్నికల కమిషన్‌ను నియమించడం బీజేపీ ప్రభుత్వానికి తగదని కోర్టు జడ్జిమెంట్ ఇవ్వకముందే ఎన్నికల కమిషన్‌ను ఎలా నియమిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జాతీయ ఎన్నికల కమిషన్ నియామకంపై బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం తగదన్నారు. దేశంలో అనేకమంది ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రభుత్వంలోకీలకంగా వ్యవహరిస్తున్న వారు నేరారోపణలు ఎదుర్కొంటున్నారని వారిపై ఏళ్ల తరబడి విచారణ జరగకుండా త్వరితగతిన పూర్తి చేయా లని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణనను స్వాగతిస్తున్నామన్నారు. ఇదే తరహాలో దేశ వ్యాప్తంగా కులగనణ జరగలన్నారు. గత శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో సీపీఐఎన్నికల అవగాహన చేసుకుని నేటికీఅది కొనసాగుతోందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి గెలుపుకోసం ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు, బామండ్లపల్లి యుగేందర్, న్యాలపట్లరాజు, బోనగిరి మహేందర్, నాయకులు మామిడిపల్లి హేమంత్‌కుమార్, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒక్క బోరు.. 16 కనెక్షన్లు


బోర్‌కు బిగించిన నల్లా పైపులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 2వ వార్డులో సుమారు 20 కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామ పంచాయతీ చేతి పంపు ద్వారా నీరు అందకపోవడంతో ఆ కాలనీవాసులు మూడేళ్ల కిందట కలిసి డబ్బులు పోగు చేసుకుని బోరు వేయించుకున్నారు. ఒకే బోరుకు 16 కనెక్షన్లు ఇచ్చి నీటి సమస్యను అధిగమిస్తున్నారు. బోరు మోటారు, స్టార్టర్ కాలిపోతే మరమ్మతులకు అయ్యే ఖర్చులను ఇంటింటా డబ్బులు జమ చేస్తూ చెల్లిస్తున్నారు. బోరు మోటారుకు మాత్రం గ్రామ పంచాయతీ విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. విద్యుత్ సరఫరా లేనిపక్షంలో తమకు నీటికి ఇబ్బందులు తప్పడం లేవని కాలనీవాసులు పేర్కొంటున్నారు. మిషన్ భగీరథ అసంపూర్తిగా వదిలేశారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ కాలనీకి భగీరథ నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉడకని అన్నం.. కుళ్లిన కూరగాయలు..

- కేజీబీవీని తనిఖీ చేసిన తహసీల్దార్
- సిబ్బందిపై ఆగ్రహం


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మారుతిరెడ్డి

వీర్నపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉడకని అన్నం.. కుళ్లిపోయిన కూరగాయలు చూసి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సిబ్బందిపై స్థానిక తహసీల్దార్ మారుతిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను మధ్యాహ్నభోజన సమయంలో గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా అన్నం, కూరలను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజన మెనూ ఏంటని సిబ్బందిని ప్రశ్నించగా ఎవరు సమాధానం ఇవ్వలేదు. విద్యార్థులకు మెనూప్రకారం భోజనం ఎందుకు అందించడం లేదన్నారు. పాఠశాలలో సరైనభోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడగగా వారం రోజులుగా అన్నం ఉడకడం లేదని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఉదయం పూట టిఫిన్ అందించేందుకు నెలరోజులుగా గ్రైండింగ్ మిక్సీ చెడిపోయినా సరిచేయలేదన్నారు. అనంతరం అక్కడే ఉన్న స్టోర్‌రూమ్‌ను పరిశీలించగా బూజుపట్టిన క్యారెట్‌లు, కుళ్లిపోయిన టమాటాలు, ఆలుగడ్డలు కనిపించడంతో వాటిని వెంటనే అక్కడి నుంచి తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాల ఆవరణలో కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు.

ప్రత్యేక అధికారి లేక పర్యవేక్షణ కరువై..

కేజీబీవీ పాఠశాలలో నెలరోజులుగా ప్రత్యేక అధికారి లేకపోవడంతో పాఠశాలలో పర్యవేక్షణ కరువైంది. ఇక్కడ పనిచేసిన ప్రత్యేక అధికారి పద్మ మర్రిపల్లి కేజీబీవీ పాఠశాలకు బదిలీకాగా, అక్కడి ప్రత్యేక అధికారి శకుంతల ఈపాఠశాలకు రావాల్సిఉండగా ఇప్పటివరకు జాయిన్‌కాలేదు. ఉన్నసిబ్బంది ఎవరికివారే ఇష్టానురీతిగా వ్యవహరించడంతో విద్యార్థులకు కష్టాలు తప్పడంలేదు. రెగ్యులర్‌స్టాఫ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ హాజరు రికార్డులను తహసీల్దార్ పరిశీలించగా మధ్యమధ్యలో కొంతమంది సంతకం చేయకుండా ఖాళీగా ఉండడం గమనించారు. రిజిస్టర్‌లో ఖాళీలు ఎందుకు ఉన్నాయని తహసీల్దార్ ప్రశ్నించగా సంతకాలు చేయడం మర్చిపోయారని సమాధానమిచ్చారు. ఇలాంటి పొరపాట్లు మరలా కనిపించద్దని తహసీల్దార్ హెచ్చరించారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, జడ్పీహెచ్ఎస్ వీడీ చామంతి, పాఠశాల ఇన్‌చార్జిలు పద్మ, మమత ఉన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ ఫలితాలు విడుదల

గణేష్‌నగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన హోటల్ మేనేజ్‌మెంట్ 1,3,5 సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ రంగప్రసాద్ విడుదల చేశారు. ఈ ఫలితాలు www.satavahana.ac.in వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

విద్యుత్ సమస్యలుంటే అధికారులకు తెలియజేయాలి

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలుంటే అధికారులకు తెలియజేయాలని టెక్నికల్ డీఈ ఉపేందర్ అన్నారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పొలంబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిన్న పాపయ్యపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు విద్యుత్‌కు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. రైతులు తడిచేతులతో స్టార్టర్‌బాక్సులు ముట్టుకోకూడదన్నారు. ఐరన్‌బాక్సులు ఉంటే తక్షణమే తొలగించి ప్లాస్టిక్‌స్టార్టర్ బాక్సులను పెట్టుకోవాలన్నారు. విద్యుత్తు సమస్యలుంటే నేరుగా అధికారులకు తెలియజేయాలన్నారు. లేనిపక్షంలో 1912నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈ సంతోష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.


చిన్నపాపయ్యపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న టెక్నికల్ డీఈ ఉపేందర్

జాతీయస్థాయి యోగా పోటీల్లో ఐదో స్థానం



జాతీయ యోగాసన వేదికపై ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆమని

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో ఈ నెల19న జరిగిన 49వ జాతీయస్థాయి యోగాసనపోటీల్లో ఉమ్మడికరీంనగర్ జిల్లాకు చెందిన జాపతి ఆమని ప్రతిభ చాటింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన ఆమని 25-30సంవత్సరాల వయస్సు కేటగిరీలో తెలంగాణ రాష్ట్ర జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించి ఐదవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆమనిని తెలంగాణ రాష్ట్రయోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్దారెడ్డి, ఉపాధ్యక్షుడు కన్నకృష్ణ, యోగాకోచ్‌లు కిష్టయ్య, రామకృష్ణ, మల్లీశ్వరి అభినందించారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి

- సోషల్ మీడియా దుష్ప్రచారాన్ని, కుట్రలను తిప్పికొట్టాలి
- అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలి
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, సోషల్‌మీడియా దుష్ప్రచారం, కుట్రలను తిప్పికొట్టాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్లశ్రీధర్‌బాబు పార్టీశ్రేణులకు సూచించారు. గురువారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఎమ్మెల్సీఎన్నికల్లో నరేందర్‌రెడ్డి విజయం కోసం కృషిచేయాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో బీజేపీ, బీఆర్ఎస్‌తోపాటు కొంతమంది నరేందర్‌రెడ్డికి వ్యతిరేకంగా చేస్తున్న దుష్ప్రచారాలను, ప్రభుత్వంపై ఇతరపార్టీలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లకు గ్రూప్-1 పరీక్ష నిర్వహించిన ఘనత కాంగ్రెస్ పార్టీదని, ఏ రాష్ట్రంలో లేనివిధంగా 56వేలఉద్యోగాలు కల్పించామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులకు 20వ తేదీ వరకు జీతాలు చెల్లించలేదని, తమ ప్రభుత్వం వచ్చాక మొదటి వారంలోనే జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని శ్రీధర్‌బాబు విమర్శించారు. అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి కాంగ్రెస్‌అభ్యర్థిగా గెలిపించాలని, ఆయన గెలుపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కీలకమన్నారు. కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా గెలిచేందుకు ప్రతిఒక్కరూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డి విజయంకోసం కృషిచేయాలని శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యర్థులు తనను ఎదుర్కోలుగా కోట్లు ఖర్చు పెడుతూ సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ శ్రేణులంతా ఈ ప్రచారాన్ని తిప్పికొట్టి తనవిజయానికి కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన అద్భుతంగా సాగుతోందని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్, కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, అసెంబ్లీ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ప్రణవ్‌బాబు పాల్గొన్నారు.

అవీఇవీ

మత్తు పదార్థాలతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

భగత్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల బారినపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కరీంనగర్‌రూరల్ ఎక్సైజ్ ఎస్సై విజయభాస్కర్ అన్నారు. గురువారం కొత్తపల్లి మండలంలోని ఆసిఫ్‌నగర్ (బావుపేట) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిసిపిఓ పర్వీన్, ఐసిపిఎస్ కవిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎక్సైజ్ సిబ్బంది స్వప్న, శ్రీలత, రమాదేవి పాల్గొన్నారు.

ఉద్యమ నాయకులను ఎమ్మెల్సీగా గెలిపించండి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పట్ల అవగాహన కలిగిన, ఉద్యమ నాయకులను ఎమ్మెల్సీగా గెలిపించాలని, ధన రాజకీయాలను ఓడించాలని టిపిటిఎఫ్ రాష్ట్ర నాయకుడు కోల రాజమల్లు ఒక ప్రకటనలో ఉపాధ్యాయులు, పట్టభద్రులకు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ సమస్యల పట్ల అవగాహన కలిగిన వై.అశోక్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.

రాజలింగమూర్తి హత్యపై న్యాయ విచారణ జరిపించాలి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భూపాల్‌పల్లి జిల్లా కేంద్రంలో ప్రజావేగు, సామాజిక కార్యకర్త, సమాచార హక్కు పరిరక్షణ పోరాట యోధుడు నాగవల్లి రాజలింగమూర్తి దారుణ హత్యను కరీంనగర్ వినియోగదారుల మండలి, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తీవ్రంగా ఖండించాయి. గురువారం ఆ సంస్థలు అత్యవసర కార్యవర్గ సమావేశాలను ఏర్పాటు చేసి రాజలింగమూర్తి హత్యను ఖండించాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ ఏడవ బ్లాకు హెచ్-1 కుంగుబాటుకు బాధ్యులైన రాజకీయ నాయకులు, ప్రాజెక్టు అధికారులపై ఆయన చేసిన న్యాయపోరాటానికి, భూపాలపల్లి శివారు సర్వే నెంబర్ 171లో విలువైన అటవీ భూమి అన్యాక్రాంతం కాకుండా ఆయన హైకోర్టులో చేసిన న్యాయపోరాటానికి అధికారులు, రాజకీయ నాయకులు కక్షకట్టారని ఆరోపించారు. ఈ సమావేశాల్లో ఆర్.వెంకటేశ్వర్‌రావు, ప్రకాశ్‌హోల్లా, చంద్ర ప్రభాకర్, కోల రాంచంద్రారెడ్డి, ముజఫర్, గంగాధర్, గంగారావు, మనోహర్, లక్ష్మారెడ్డి ఉన్నారు.

నాలుగిళ్లలో చోరీ

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు ప్రాంతాలైన మల్కాపూర్, రేకుర్తిలోని నాలుగిళ్లలో గురువారం చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం రేకుర్తి, మల్కాపూర్‌లోని తాళం వేసిన నాలుగు ఇళ్లలోకి దొంగలు చొరబడి నగదు, బంగారం ఆభరణాలు దొంగతనం చేశారు. పోలీసులు ఈ విషయాన్ని నిర్ధారించలేదు.

ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం మానుకోవాలి

- బండి సంజయ్‌కి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హితవు


సమావేశంలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రజలను తప్పుదోవ పట్టించే కుటిల ప్రయత్నాలు మానుకోవాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హితవు పలికారు. గురువారం కరీంనగర్ పట్టణంలో నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అంతర్గత మిత్రుడు కేసీఆర్ నిర్వాకం వల్లనే కదా రాష్ట్రం అప్పుల పాలయిందని, అయినప్పటికీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో అన్ని వర్గాలను అదుకుంటూ ప్రజాపాలన అందిస్తే చూస్తూ ఓర్వలేక కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని అన్నారు. క్రమశిక్షణ పరిక్వత లేని రాజకీయ వ్యభిచారి సునీల్‌రావు అని ఆరోపించారు. టీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు మేయర్ పదవి ఇప్పించాలని వినోద్‌కుమార్‌ను కరీంనగర్ అభివృద్ధి ప్రదాత అని పిలిచిన అదే నోరు బీజేపీలో చేరాక బండి సంజయ్ కుమార్‌ను స్మార్ట్‌సిటీ ప్రదాతగా పోల్చడం రాజకీయ వ్యభిచారానికి నిదర్శనమని అన్నారు. అవినీతి బాగోతం బహిర్గతం చేస్తే నీవు తట్టుకోలేవని హెచ్చరించారు. బీజేపీలోకి గతంలో వెళ్లిన నాయకులు ఎక్కడున్నారో నీకు కూడా అదే గతి పడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీలోకి వస్తానని చూసిన సునీల్‌రావును తిరస్కరిస్తే బీజేపీలో చేరాడని విమర్శించారు. నా రాజకీయ ప్రస్థానం మొత్తం కాంగ్రెస్సే అని అన్నారు. పార్టీ కోసం నిబద్ధతతో పని చేయడంతోనే అదిష్టానం తనకు సుడా చైర్మన్ పదవి ఇచ్చిందన్నారు. చౌకబారు విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎండి తాజ్, శ్రావణ్ నాయక్, కుర్ర పొచయ్య, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, నగేష్ ముదిరాజ్ మామిడి సత్యనారాయణ రెడ్డి, బొబ్బిలి విక్టర్, జీడీ రమేష్, అస్తపురం రమేష్ పాల్గొన్నారు.

నాలుగు విడతల్లో ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపు

- హౌసింగ్ డిప్యూటీ ఈఈ గంగాధర్


లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మించుకునే ఇందిరమ్మ లబ్ధిదారులకు నాలుగు విడతల్లో బిల్లులు చెల్లింపు జరుగుతుందని హౌసింగ్ డిప్యూటీ ఈఈ గంగాధర్ తెలిపారు. గురువారం కరీంనగర్ మండలం బహదూర్‌ఖాన్‌పేటలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించే సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన కొలతలు పాటించాలని సూచించారు. కనీస విస్తీర్ణం 400 స్కేర్ ఫీట్స్ ఉండాలని, మించి ఉండరాదని తెలిపారు. మొదటగా బెస్‌మెంట్ సమయంలో లక్ష రూపాయలు, ఆ తరువాత గోడలు పూర్తయ్యాక లక్ష రూపాయలు, స్లాబ్ వేశాక 2లక్షలు, ఇళ్లు పూర్తయిన తరువాత లక్ష రూపాయలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్‌మోహన్ రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో దేశం సుభిక్షం

- మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంలోనే భారత దేశం సుభిక్షంగా ఉంటుందని మాజీ మేయర్, బీజేపీ నాయకుడు యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని కాశ్మీరుగడ్డ ఉమెన్స్ డిగ్రీ కళాశాల, 33వ డివిజన్ భగవతి స్కూల్, ట్రినిటీ కళాశాలల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఆయన కలిసి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. దేశం సుభిక్షంగా ఉండేందుకు బీజేపీకి ప్రజలు మద్దతు ఇవ్వాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి మల్క కొమురయ్యకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీదేవి చంద్రమౌళి, నాయకులు కన్నం శ్రీనివాస్, అశోక్, ఉపేందర్, కిరణ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా

- టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేష్‌బాబు

గణేశ్‌నగర్,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ డిమాండ్ రోజురోజుకు పెరుగుతున్న క్రమంలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టినట్లు కరీంనగర్ సర్కిల్ కార్యాలయం సూపరింటెండెంట్ ఇంజనీర్ మేక రమేష్ స్పష్టం చేశారు. రాబోయే మూడు నెలల్లో గణనీయంగా విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉందని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ముందస్తుగా లోడ్ పెరిగే ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు 189 ఏర్పాటు చేశామని, అలాగే 157 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం కూడా పెంచామని, 33/11 కెవి సబ్ స్టేషన్‌లలో కొత్తగా 8, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను నెలకొల్పామన్నారు. 5 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం కూడా పెంచామని వివరించారు. విద్యుత్ వినియోగదారులకు ప్రత్యామ్నాయ లైను(ఇంటర్ లింకు లైన్) ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు కొత్తగా 6నెం ఇంటర్ లింకింగ్ లైన్లను ఏర్పాటు చేశామని చెప్పారు. అవసరం మేరకు కొత్త ఫీడర్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవికి ఎటువంటి అంతరాలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

యూరియా అందక రైతుల అవస్థలు


దుర్శేడ్ సొసైటీకి యూరియా కోసం వచ్చిన రైతులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో సరిపడినంత యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం దుర్శేడ్ సహకార సంఘానికి 20 టన్నుల యూరియా రాగా గురువారం ఉదయం పంపిణీ చేశారు. విషయం తెలుసుకున్న రైతులు సంఘ కార్యాలయం వద్ద బారులు తీరారు. యూరియా బస్తాలు రెండు గంటల్లోనే స్టాక్ అయిపోవడంతో చాలా మంది రైతులు వెనుదిరిగారు. మార్క్‌ఫెడ్ అధికారుల నిర్లక్ష్యంతో సమయానికి స్టాక్ రావడం లేదని, సింగిల్ విండో కేంద్రాల వద్దకు ప్రతి రోజు ప్రదక్షిణలు చేస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. యూరియా కొరతను అదునుగా చూపి ప్రైవేటు డీలర్లు ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. స్టాక్ వచ్చిన తర్వాత 60శాతం సహకార సంఘాలకు, 40శాతం డీలర్లకు పంపిణీ చేస్తారు. కరీంనగర్ మండలంలో 1,170 టన్నుల యూరియా అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు ఆయా సహకార సంఘాలకు 560 టన్నులు పంపిణీ చేశారు. దుర్శేడ్ సహకార సంఘానికి 200 టన్నులు, నగునూర్ అగ్రోస్ కేంద్రానికి 150 టన్నులు, బొమ్మకల్‌కు 110 టన్నులు, తీగలగుట్టపల్లి డీసీయంఎస్‌కు 150టన్నులు ఇప్పటి వరకు యూరియాను పంపించారు. 610టన్నులు సహకార సంఘాలకు పంపించాల్సి ఉంది. ఇంకా దుర్శేడ్‌కు 40 టన్నులు, చెర్లబూత్కూర్‌కు 20టన్నులు, బొమ్మకల్‌కు 10 టన్నులు, తీగలగుట్టపల్లికి 10 టన్నులు, నగునూర్‌కు 10టన్నులు ఇండెంట్ పెట్టినట్లు మండల వ్యవసాయాధికారి తెలిపారు. గురువారం సాయంత్రం వస్తాయని వెంటనే పంపిణీ చేస్తామని తెలిపారు.

ప్రతి రైతుకు అందిస్తాం

- ఏవో బి. సత్యం

అవసరం ఉన్న ప్రతి రైతుకు యూరియా అందిస్తాం. ప్రస్తుతానికి దుర్శేడ్ సహకార సంఘానికి 20టన్నులు వచ్చాయి. మిగతా సంఘాలకు ఇండెంట్ పెట్టాము. గురువారం సాయంత్రం వరకు వస్తాయి. డిమాండ్‌ను బట్టి ఇండెంట్ పెడుతాం. వచ్చిన వెంటనే రైతులకు అందిస్తాం.

రంజాన్ పండుగకు సౌకర్యాలు కల్పించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ముస్లిం నాయకులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ మాసం మార్చి 2వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నందున నగరంలోని అన్ని మసీదులు, ప్రార్థనా స్థలాలు, ముస్లిం కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎంఐఎం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గురువారం ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్‌హుస్సేన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, టౌన్ ఏసీపీ, ఎన్పీ డీసీఎల్ ఎస్ఈని కలిసి వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, నాయకులు ఖమ్రుద్దీన్, అతిన, ఇబ్రహీం, అఖిల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, అలీబాబా పాల్గొన్నారు.

నేడు కేంద్ర బడ్జెట్‌పై మేధావుల సమావేశం

భగత్‌నగర్, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ 2025పై శుక్రవారం మేధావులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి హాజరతారన్నారు. నగరంలోని వైశ్య భవన్‌లో ఉదయం 10 గంటలకు మేధావులతో సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి మేధావులు, అడ్వకేట్లు, డాక్టర్లు, వ్యాపార వాణిజ్య వర్గాలు, పారిశ్రామికులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, సమాజ సేవకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, పరికరాల పంపిణీ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఒక కళాశాల ప్రాంగణంలో ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు 13 ట్రైసైకిళ్లు, 10 వీల్ చైర్లు, 8 చేతికర్రలు, 15 మందికి వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్, జూనియర్ జడ్జి సరళరేఖ, జిల్లా మహిళా సంక్షేమ అధికారి సబిత, సంస్థ ప్రతినిధులు అనిస్, ప్రీత, దీప్తి, షోరోస్ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

'బాపు' సినిమా పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన రాజు, భానుప్రసాద్‌రెడ్డి సంయుక్తంగా కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై దయా దర్శకత్వంలో నిర్మించిన 'బాపు' చలనచిత్ర పోస్టర్‌ను గురువారం ఫిలింభవన్‌లో కఫిసొ బాధ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ మధ్య తరగతి రైతు కుటుంబంలోని సమస్యలు, వాటిని ఎదుర్కొనే క్రమంలో మానసిక ఒత్తిడిలు, తెలంగాణ మట్టి వాసనల పరిమళాలను వెదజల్లే విధంగా సినిమా తెరకెక్కించినట్లు తెలిపారు.

కొత్తపల్లిలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

భగత్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఓటు వేయాలని పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జేరిపోతుల వాసు, కవ్వంపల్లి రాజ్‌కుమార్, సంగం మునీందర్, వికాస్ అహ్మద్‌ఖాన్, సర్దార్ అలాం పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయం హుండీ లెక్కింపు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి దేవాలయ హుండీలను గురువారం లెక్కించారు. కాగా 15,71,953 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈఓ సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ పాము సత్యనారాయణ, ఆలయ వ్యవస్థాపక వంశీయ ధర్మకర్తలు శ్రీనివాస్, గంగాధర్ ఉన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి: డీఐఈవో


విద్యార్థులకు చెక్కులను పంపిణీ చేస్తున్న డీఐఈవో జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీవో రాము

గంగాధర, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని డీఐఈవో జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ప్రభుత్వజూనియర్ కళాశాలలో 20మందివిద్యార్థులకు రూ.1.62లక్షల మలబార్‌గోల్డ్ స్కాలర్‌షిప్‌లను పంపిణీచేశారు. దేశవ్యాప్తంగా బాలికలకు, మహిళాసాధికారతకు మలబార్‌గోల్డ్‌సంస్థ ఎంతో సహకారం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మలబార్‌గోల్డ్‌సంస్థ ప్రతినిధులు విక్కీ, శ్రీనివాస్, ప్రిన్సిపాల్‌సత్యనారాంజనేయ, ఎంపీడీవో రాము పాల్గొన్నారు.

తపాలా కార్యాలయం ఎదుట ఉద్యోగుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా ఉద్యోగులు

హుజూరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన తపాలాకార్యాలయం ఎదుట తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని గురువారం ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత పోస్టల్ ఉద్యోగుల సంఘం గ్రూప్-సీ రాష్ట్ర అధ్యక్షుడు ఉకంటి మహేందర్ మాట్లాడుతూ పోస్టల్ చట్టం 2023వల్ల పోస్టల్ సేవలు ప్రైవేట్‌పరం కానున్నాయన్నారు. మార్చి18నుంచి పోస్టల్‌ఉద్యోగుల దేశవ్యాప్త నిరవధిక సమ్మెనిర్వహిస్తామని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో జక్కురజనీకాంత్,గోపికిషన్,రాజకుమార్,తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులు , నాయకుల ప్రచారం

హుజూరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఇచ్చి గెలిపించాలని స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని హైస్కూల్ మైదానంలో ఆయనప్రచారం చేశారు.

వీణవంక: మండలంలోని మాల్లారెడ్డిపల్లిలో బీజేపీ అభ్యర్థి చిన్నమల్లై అంజిరెడ్డికి మొదటిప్రాధన్యత ఓటు వేయాలని బూత్ అధ్యక్షుడు కర్రె నాని, కొలిపాక శ్రీనివాస్,రాయవేని తిరుపతి, తదితరులు పట్టభద్రుల ఇంటింటికివెళ్లి అభ్యర్థించారు.

గన్నేరువరం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపుకోసం సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి హన్మండ్ల భాస్కర్ ప్రచారంచేశారు. మండలంలోని గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్ గ్రామాల్లో ఆయన ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు.

చిగురుమామిడి: రాష్ట్రంలో బీజేపీకి విశేష ఆదరణ లభిస్తోందని, దీంతోనే ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం ఖాయామని బీజేపీ కరీంనగర్ పార్లమెంటుకన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. గురువారం మండలకేంద్రంలో బీజేపీ మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

దేశంలో నిరుద్యోగ శాతం పెరిగిపోయింది

- అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపిస్తే పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి ● రాష్ట్ర గ్రంథాలయాల చైర్మన్ రియాజ్


మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయాల చైర్మన్ రియాజ్


తిమ్మాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

జమ్మికుంట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): దేశంలో నిరుద్యోగ శాతం పెరిగిపోతోందని రాష్ట్ర గ్రంథాలయాల చైర్మన్ రియాజ్, సీపీఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం జమ్మికుంట పట్టణంలోని వర్తకసంఘంలో కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వినరేందర్‌రెడ్డికి మద్దతుగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి వారితోపాటు జిల్లా కార్యదర్శి మర్రి వెంకట్‌స్వామి, ఏఐవైఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు పంజాల శ్రీనివాస్‌లు హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలపరిష్కారానికి కృషి చేస్తారన్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్‌లైన్లో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నరేందర్‌రెడ్డి ఫోన్‌లైన్లో మాట్లాడుతూ తాను జమ్మికుంటలో ఉన్నరోజు ఢిల్లీ నుంచి టికెట్ కన్ఫామ్ అయినట్లు ఫోన్ వచ్చిందని, మీ అందరి సహకారంతో గెలిచిన తర్వాతమొదటి విజయోత్సవర్యాలీ జమ్మికుంటలో చేస్తానని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం కావాలి..

తిమ్మాపూర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపును ఖాయం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎల్ఎండీకాలనీలో గురువారం మండలకాంగ్రెస్ అధ్యక్షుడు మోరపల్లిరమణారెడ్డి అధ్యక్షతన జరిగిన మండల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్‌అభ్యర్థినరేందర్‌రెడ్డి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలుకలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

నరేందర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలి..

సైదాపూర్: నరేందర్‌రెడ్డిని అధికమెజార్టీతో గెలిపించాలని సీపీఐ జిల్లాకార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. గురువారం సైదాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో ఉద్యోగులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత నరేందర్‌రెడ్డికి ఇవ్వాలన్నారు.

ఇల్లందకుంట: నరేందర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని పరకాలఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఇల్లందకుంట, జమ్మికుంట మండలాల కో-ఆర్డినేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలపై శాసనమండలిలో నరేందర్‌రెడ్డి గట్టిగా కొట్లాడతారన్నారు.

గన్నేరువరం: నరేందర్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ముస్కు ఉపేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ జువ్వాడి మన్‌మోహన్‌రావు, తదితరులుప్రచారం నిర్వహించారు. నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని పట్టబద్రులను అభ్యర్థించారు.

'ఆత్మ' ఆధ్వర్యంలో డీలర్ల క్షేత్ర సందర్శన

గన్నేరువరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా రైతు శిక్షణా కేంద్రం 'ఆత్మ' ఆధ్వర్యంలో డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్‌సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్‌డీలర్స్ మండలంలోని వివిధ పంటలపై గురువారం క్షేత్ర సందర్శన చేశారు. ఈ శిక్షణను మండల కేంద్రానికి చెందిన డీలర్ సందవేని ప్రశాంత్, ఖాసింపేటకు చెందిన బద్దం మహిపాల్‌రెడ్డి ఒక సంవత్సరం కోర్సును తీసుకునేందుకు ముందుకు రాగా వారికి వరి, మొక్కజొన్న పంటలలో ఆశించిన పురుగు, తెగులుపై క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఖాసింపేటలో రైతు మహిపాల్‌రెడ్డి సాగుచేసిన బొప్పాయి పంటను సందర్శించి చీడపీడలపై డీలర్లకు శిక్షకుడు రామచంద్రారావు వివరించారు.

అధిక మెజార్టీతో గెలిపించాలి

హుజూరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేవైఎం రాష్ట్రకార్యదర్శి మదన్ అన్నారు. గురువారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్స్‌ఎమ్మెల్సీ మల్కా కొంరయ్యను ఉపాధ్యాయులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, పట్టభద్రులు భారీమెజార్టీతో గెలిపించాలన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి


మానకొండూర్‌లో మాట్లాడుతున్న రాములు

మానకొండూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని మిషన్‌భగీరథ ఎస్ఈ రాములు అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం తాగునీటి సరఫరాపై కార్యదర్శులు, అధికారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఎక్కడైనా పైపుల లీకేజీ వెంటనే మరమ్మతులు చేపట్టాలని అన్నారు. ట్యాంకులలో బ్లీచింగ్ చల్లి, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈఈ రాంకుమార్, అంజన్‌రావు, ఎంపీడివో వరలక్ష్మి, డీఈ ఏఈలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపల్లిలో పారిశుధ్య పనులు కరువు


చెత్తాచెదారంతో పేరుకపోయిన డ్రైయినేజీ

వీణవంక, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామకార్యదర్శి నిర్లక్ష్యంతో అపరిశుభ్రత పేరుకుపోతోందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఒల్లాల శ్రీకాంత్ అన్నారు. గ్రామంలో మురికికాలువలు శుభ్రపరుచకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుందని కార్యదర్శికి ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో ప్రజలు సీజనల్‌వ్యాధుల బారినపడే అవకాశం ఉందని ఆరోపించారు. ఉన్నాతాధికారులు గ్రామంలో పర్యటించి గ్రామపరిశుభ్రతకు తోడ్పడాలని కోరారు.

అంతర్జాతీయ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

హుజూరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాకతీయ కాలనీకి చెందిన హుమేర తస్నీమ్ అనే విద్యార్థి అంతర్జాతీయ కరాటేపోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ కటాస్ 8సంవత్సరాల బాలికల విభాగంలో హుమేర తస్నీమ్ పాల్గొని గోల్డ్ మెడల్ సాధించింది.

'ఆరోగ్యమహిళా' క్యాంపు

శంకరపట్నం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్ గ్రామంలోని హెల్త్‌సబ్‌సెంటర్‌లో గురువారం ఆరోగ్యమహిళాక్యాంపు నిర్వహించారు. డాక్టర్‌శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యమహిళా క్యాంపునకు వచ్చిన మహిళల ఆరోగ్య సమస్యలు తెలుసు కొని వైద్యపరీక్షల నిమిత్తం శాంపిల్స్ సేకరించినట్లు తెలిపారు. శంకర పట్నం మండలం కొత్తగట్టు హెల్త్ సబ్‌సెంటర్ పరిధిలోని కొత్తగట్టు, గొల్లపల్లి, చింతలపల్లి గ్రామాల్లో 100డేస్ టీబీ కార్యక్రమాల్లో భాగంగా టీబీవ్యాధిపై అవగాహన కల్పించారు.

నేడు సామాజిక తనిఖీ

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ కార్యక్రమం శుక్రవారం జరగనున్నట్లు ఎంపీడీవో తూర్పాటి సునీత గురువారం ఒకప్రకటనలో తెలిపారు.19 గ్రామపంచాయతీలకు సంబంధించి 2023-24లో చేపట్టిన ఉపాధి హామీపనులు, 15వవిడుత చేపట్టనున్న ఉపాధిహామీ పనులపై సమావేశం 10గంటలకు జరుగుతుందని తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా స్నేహితులు

తిమ్మాపూర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణకాలనీలోని సుభాష్‌నగర్‌కు చెందిన బోల్ల సంతోష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. పదవ, ఇంటర్ స్నేహితులంతా కలిసి అండగా ఉండాలని నిశ్చయించుకుని కొంత నగదును సంతోష్ కూతురు పేరు మీద రూ.31వేలు ఫిక్స్ డిపాజిట్ చేసి గురువారం బాండ్‌ను అందజేశారు. భవిష్యత్‌లో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తోటపల్లి అనిల్, ఆవుల శ్రీకాంత్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.